

వ్య.కా.స రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వచ్చే నెల 8, 9, 10 తేదీల్లో ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో నిర్వహించే ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగరాపు ఈశ్వరమ్మ పిలుపునిచ్చారు. నగరంలోని ఆ సంఘ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిర్ల ప్రసాదరావు, జి.సింహాచలంతో కలిసి మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 8 తేదీన జంగారెడ్డిగూడెంలో నిర్వహించే బహిరంగ సభకు సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎ.విజయ రాఘవన్, బి.వెంకట్ హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కొల్లి.ఎల్లయ్య. దుబ్బ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల విముఖత

- ఎన్‌హెచ్‌ఎఫ్‌డిసి ద్వారా సబ్సిడీ లేని రుణ పథకం
- జిల్లాకు రూ.కోటి కేటాయింపు
- రూ.82 లక్షల రుణానికే దరఖాస్తులు
- వచ్చే నెల మూడో తేదీన రుణాలు అందజేత

అవి సబ్సిడీ రుణాలు కాదు. అయినా కఠిన నిబంధనలు పెట్టారు. జిల్లాకు కోటి రూపాయలను కేటాయించారు. కానీ పలు ఆంక్షలతో కొద్దిమంది మాత్రమే అర్హత సాధించగలిగారు. ఫలితంగా జాతీయ వికలాంగుల ఆర్థిక అభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్‌ఎఫ్‌డిసి) కేంద్ర దివ్యాంగజన స్వావలంబన యోజన (డిఎస్‌వై) పేరుతో కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన రుణ పథకం ఎందుకూ కొరగాకుండా పోయింది. కఠిన నిబంధనలు పెట్టడంతో దరఖాస్తు చేసేందుకూ ముందుకు రాలేదు. దీంతో జిల్లాకు కేటాయించిన యూనిట్లను పూర్తిస్థాయిలో వినియోగించుకోలేని పరిస్థితి నెలకొంది. ఫలితంగా స్వయం ఉపాధి పొందాలనుకున్న వికలాంగులకు నిరాశే మిగిలింది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జాతీయ వికలాంగుల ఆర్థిక అభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్‌ఎఫ్‌డిసి) ద్వారా 2022-23 ఆర్థిక సంవత్సరం నుంచి దివ్యాంగజన స్వావలంబన యోజన (డిఎస్‌వై) పేరుతో రుణ పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఈ ఏడాది ఆగస్టులో దరఖాస్తులను ఆహ్వానించింది. మొత్తం 42 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో 32 మందిని అర్హులుగా అధికారులు తేల్చారు. వీరికి రూ.82 లక్షల మేర రుణం అందించాల్సి ఉంది. వాస్తవానికి వికలాంగులకు ఈ పథకం ద్వారా రూ.కోటి వరకు రుణం కల్పించే అవకాశం ఉంది. రుణాలకు తగినంత మంది దరఖాస్తు చేసుకోకపోవడంతో రూ.18 లక్షలు వినియోగించుకోలేని పరిస్థితి



నెలకొంది. రుణ సౌకర్యానికి అర్హత సాధించిన 32 మందికి వచ్చే నెల మూడో తేదీన జాతీయ వికలాంగుల దినోత్సవం రోజున రుణాలను మంజూరు చేయనున్నట్లు అధికారులు చెప్తున్నారు.

వడ్డీతో పాటు అపరాధ రుసుము వసూలు

దివ్యాంగజన స్వావలంబన యోజన కింద జిల్లాకు కేంద్ర ప్రభుత్వం రూ.కోటి కేటాయించింది. ఈ డబ్బులతో వికలాంగులకు వ్యాపార, సేవా రంగాల యూనిట్లను నెలకొల్పడం, వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవడానికి రుణాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. రుణాల అందజేతను రెండు కేటగిరీల కింద విభజించింది. రూ.పది వేల నుంచి రూ.50 వేల వరకు ఒక కేటగిరీగా, రూ.50,001 నుంచి రూ.5 లక్షల వరకు రెండో కేటగిరీగా పేర్కొంది. మొదటి కేటగిరీ కింద రుణాలు తీసుకున్న వారికి ఏడాదికి ఐదు శాతం, రెండో కేటగిరీ కింద రుణాలు పొందే వారి నుంచి ఆరు శాతం చొప్పున వడ్డీ చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. రూ.లక్ష వరకు తీసుకున్న రుణాన్ని మూడేళ్లలో, రూ.ఐదు లక్షల వరకు తీసుకున్న రుణాన్ని ఐదేళ్ల లోపు చెల్లించాలని పేర్కొంది. ఒకవేళ రుణాన్ని నిర్ధేశించిన సమయంలో చెల్లించకపోతే వార్షిక వడ్డీకి అదనంగా మరో మూడు శాతం వడ్డీ చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది.

కఠిన నిబంధనలే కారణమా?

రుణ పథకానికి సబ్సిడీ లేకపోవడంతో పాటు వడ్డీ భారంగా ఉండడంతో వికలాంగుల నుంచి పెద్దగా స్పందన కనపడడం లేదని తెలుస్తోంది. రూ.లక్ష వరకు రుణాన్ని పొందాలంటే ఐదేళ్ల సర్వీసు ఉన్న ఒక ప్రభుత్వ ఉద్యోగి, రూ.లక్ష దాటి రుణం పొందాలంటే పదేళ్ల సర్వీసు ఉన్న ప్రభుత్వ ఉద్యోగితో ష్యూరిటీ ఇప్పించాలంటూ నిబంధన విధించింది. నిరుపేద వికలాంగులకు ష్యూరిటీ ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రాకపోవడమూ మరో కారణంగా కనిపిస్తోంది. దీంతోపాటు రుణం పొందేందుకు ఏ వ్యాపారం చేయాలనుకుంటున్నారో ప్రాజెక్టు రిపోర్టును తయారు చేయాల్సి ఉంటుంది. ప్రాజెక్టు విలువ రూ.లక్ష దాటితే జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారుల నుంచి అంచనా నివేదికను తీసుకోవాలి. కాలుష్య నియంత్రణ మండలి (పిసిబి) నుంచి ఎన్‌ఒసి కూడా పొందాలి.

వచ్చే నెల మూడో తేదీన రుణాలు అందజేత



రుణాల కోసం 42 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 32 మందిని అర్హులుగా గుర్తించాం. వారికి వచ్చే నెల మూడో తేదీన జాతీయ వికలాంగుల దినోత్సవం రోజున ప్రభుత్వం రుణాలు అందిస్తుంది. జిల్లాలో ఉన్న వికలాంగులు మొత్తం రూ.కోటి రుణం వరకు వినియోగించుకోవచ్చు. కొత్తగా ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హతను బట్టి ప్రభుత్వం వారికి రుణ సౌకర్యం కల్పిస్తుంది.

- కిరణ్‌కుమార్, ఎడి, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ

ప్రతి గింజా సేకరించాలి

పౌర సరఫరాల కమిషనర్ హెచ్.అరుణ్ కుమార్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, జలుమూరు

రైతుల నుంచి ప్రతి ధాన్యం గింజా సేకరించాలని పౌర సరఫరాల కమిషనర్ హెచ్.అరుణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. ధాన్యం సేకరణపై సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం సమీక్షించారు. అంతకుముందు జలుమూరు మండలం కరవంజలోని రైతుభరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. గతేడాది ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలులో ఎదురైన ఇబ్బందులను రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులు తమ ధాన్యాన్ని విక్రయించేందుకు మిల్లులకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. రైతుభరోసా కేంద్రాల్లోనే ఎఫ్‌టిఒ జనరేట్ చేసిన మిల్లుకు ధాన్యం పంపించాల్సి ఉంటుందన్నారు. ధాన్యంలో తేమ శాతం 17 కంటే తక్కువగా ఉండాలన్నారు. ధాన్యం సంచుల్లోకి నింపి లోడింగ్ చేసి వాహనాలతో మిల్లుకు తరలించేందుకు హమాలీ ఖర్చు రూ.22 ప్రభుత్వం అందజేస్తుందన్నారు. గోనె సంచులకు 40 కేజీల బస్తాకు రూ.3.39 ఇవ్వనున్నట్లు తెలిపారు. హమాలీ, గోనె సంచులకు రూ.50కి పైగా ఖర్చవుతోందని రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అదనంగా ఇవ్వలేమని కమిషనర్ స్పష్టం చేశారు.



ధాన్యం కొనుగోలును ప్రారంభిస్తున్న కమిషనర్ అరుణ్ కుమార్

రవాణా వాహనాలను రైతులే సమకూర్చుకుంటే ఎనిమిది కిలోమీటర్ల వరకు టన్నుకు రూ.280 రవాణా ఛార్జీలు చెల్లించనున్నట్లు తెలిపారు. నిర్ధిష్ట ప్రణాళిక ప్రకారం పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేసేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలులో రైతులకు మద్దతు ధరను కల్పించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రారంభం కావడంతో రైతులకు అవసరమైన గన్ని బ్యాగులు తొందరగా అందజేయాలన్నారు. బ్యాంకు గ్యారంటీలు ఇవ్వాలని, రైతులకు గోనె సంచులు త్వరగా అందించాలని మిల్లర్లను ఆదేశించారు. 21 రోజుల్లోనే చెల్లింపులు చేయనున్నట్లు తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ జిల్లాలో 371 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కానున్నాయన్నారు. రైతులకు అవసరమైన గోనె సంచులు, హమాలీలు, రవాణా పక్కాగా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి డి.వి రమణ, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.జయంతి, వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు కె.శ్రీధర్, ఎడిఎ కె.రవీంద్ర భారతి, తహశీల్దార్ పి.సత్యం, ఎంపిడిఒ జి.వి రవికుమార్, ఎఒ కె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్నాకులంకు ప్రత్యేక రైలు వేయాలి

డిఆర్‌ఎంకు ఎంపీ రామ్మోహన్ నాయుడు వినతి

శ్రీకాకుళం అర్బన్ : అయ్యప్ప యాత్రికుల కోసం ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి కేరళలోని ఎర్నాకులం వరకు ప్రత్యేక రైలు నడపాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు కోరారు. ఈమేరకు ఈస్ట్‌కోస్ట్ డిఆర్‌ఎంకు లేఖ రాశారు. డిసెంబరు, జనవరిలో ఎక్కువ మంది యాత్రికులు ఈ ప్రాంతం నుంచి శబరిమల వెళు ‌_ంటారని, వారికి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక రైలు నడపాలని కోరారు.

వారిని ఆదివాసీల్లో చేర్చొద్దు

52 జిఒ రద్దు చేయాలని గిరిజనుల ఆందోళన

ప్రజాశక్తి - పలాస

బెంతుఒరియా, బోయ/వాల్మీకిలను ఆదివాసీల్లో చేర్చొదని, జిఒ నంబరు 52ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ సంఘాల ఐక్య పోరాట సమితి ఆధ్వర్యాన గిరిజనులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. శ్రీకాకుళం జిల్లా పలాసలోని కాశీబుగ్గ కోసంగిపురం కూడలి నుంచి ర్యాలీగా గిరిజన సంప్రదాయ నృత్యాలతో బయలుదేరి రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు నివాసానికి సమీపంలో పాత జాతీయ రహదారిపై బైఠాయించారు. మంత్రి అక్కడకు రావాలని పట్టుబట్టారు. ప్రభుత్వానికి, మంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మంత్రి అందుబాటులో లేకపోవడంతో చాలా సమయం రోడ్డుపైనే బైఠాయించడంతో ట్రాఫిక్ స్తంభించింది. దీంతో అక్కడకు చేరుకున్న పోలీసులు శాంతియుతంగా ఆందోళన చేపట్టాలని, ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దని సూచించారు. గిరిజనులు బయలుదేరుతున్న సమయంలో మంత్రి అప్పలరాజు అటుగా రావడంతో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన జిఒ నంబరు 52ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.



రహదారిపై బైఠాయించిన గిరిజనులు


బెంతుఒరియా, బోయ/వాల్మీకిలను ఆదివాసీల జాబితాలో చేర్చవద్దని కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ సమస్యను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. గిరిజనులకు అన్యాయం చేయడం ప్రభుత్వ లక్ష్యం కాదన్నారు. మంత్రి మాట్లాడుతున్న సమయంలో కొందరు గిరిజనులకు న్యాయం చేయాలి, అందరికీ వినిపించేలా మైక్‌లో మాట్లాడాలని పెద్దపెట్టున నినాదాలు చేయడంతో మంత్రి అసహనం వ్యక్తం చేశారు. సమస్యలపై ర్యాలీ చేయాలి గానీ రాజకీయాలు చేయొద్దని ఆగ్రహం వ్యక్తం చేస్తూ అక్కడ్నుంచి వెనుదిరిగారు. అనంతరం గిరిజనులు కాశీబుగ్గ బస్టాండ్ వద్ద మానవహారం చేపట్టారు. అక్కడ్నుంచి పలాస ఆర్‌డిఒ కార్యాలయానికి చేరుకుని ఆర్‌డిఒ టి.సీతారామ్మూర్తికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆలిండియా ఆదివాసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సవర జగన్నాయకులు, ఆదివాసీ సంఘాల ఐక్య పోరాట సమితి జిల్లా చైర్మన్ సవర రాంబాబు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాబ యోగి, ఆదివాసీ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.కృష్ణారావు, పెద్ద సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులుతో శుక్రవారం నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో మాట్లాడారు. తరుచుగా రోడ్డు ప్రమాదాలు సంభవించే ప్రాంతాలను గుర్తించి నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. ఇందులో భాగంగా ప్రతిరోజూ సాయంత్రం ఐదు నుంచి ఎనిమిది గంటల మధ్య విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టాలన్నారు. మైనర్లు, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌ను నియంత్రించాలన్నారు. హెల్మెట్ ధరించని, ట్రిపుల్ రైడింగ్ చేసే వారిపై జరిమానాలు విధించాలని ఆదేశించారు. కేసుల దర్యాప్తులో కేసు వివరాలను సిసిటిఎన్‌ఎస్‌లో నమోదు చేయాలని సూచించారు.

మహిళలు, బాలికల అదృశ్యం కేసుల్లో సమగ్ర విచారణ చేసి అదృశ్యమైన వారి ఆచూకీ త్వరగా తెలుసుకోవాలన్నారు. పాత నేరస్తులకు కౌన్సెలింగ్ నిర్వహించాలని సూచించారు. గ్రేవ్ కేసుల్లో దర్యాప్తును త్వరగా పూర్తి చేసి నిందితులపై ఛార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. మహిళలపై అఘాయిత్యాలు జరిగేందుకు అవకాశం ఉన్న ప్రదేశాలను గుర్తించి నిరంతరం తనిఖీలు చేయాలని ఆదేశించారు. మహిళల భద్రత కోసం ప్రభుత్వం పోలీసు శాఖకు అందించిన 'దిశ' ప్రత్యేక వాహనాలను సమర్థవంతంగా వినియోగించుకుని మహిళలపై నేరాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. స్పందన ఫిర్యాదులపై తక్షణం స్పందించాలని, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించాలన్నారు. అనంతరం దర్యాప్తులో ప్రతిభ కనబరిచిన ఎస్ఐలు ఎ.విజయ కుమార్, బి.గణేష్‌ను అభినందించారు. లోక్ అదాలత్ ద్వారా ఎక్కువ కేసులు పరిష్కారం కావడానికి సహకరించి అగ్రభాగాన నిలిచిన రూరల్ సిఐ జి.శ్రీనివాసరావు, ఎస్ఐ ఎ.విజయ కుమార్‌ను ప్రశంసించారు. బెస్ట్ ఫైరింగ్‌లో రెండో పట్టణ సిఐ ఈశ్వర్‌ప్రసాద్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. సమావేశంలో ఎఎస్‌పి కె.శ్రీనివాసరావు, డిఎస్‌పిలు ఎం.మహేంద్ర, ఎం.శివరామిరెడ్డి, ఎస్.వాసుదేవ్, సి.హెచ్.జి.వి ప్రసాద్, జి.శ్రీనివాసరావు, బి.విజయ్ కుమార్, సిఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.



ఎఎస్‌పి శ్రీనివాసరావును సత్కరిస్తున్న ఎస్‌పి రాధిక

ఎస్ఇబిని ప్రథమ స్థానంలో నిలిపారు

స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో విభాగాన్ని రాష్ట్రంలోనే జిల్లాను ప్రథమ స్థానంలో నిలపడంలో అదనపు ఎస్‌పి శ్రీనివాసరావు చేసిన కృషి అభినందనీయమని ఎస్‌పి జి.ఆర్ రాధిక అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసు శాఖ పరిపాలన అదనపు ఎస్‌పిగా పనిచేసిన కె.శ్రీనివాసరావుకు శుక్రవారం ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో ఆమె మాట్లాడారు. ఉద్యోగోన్నతి, బదిలీ అనేవి ఉద్యోగులకు సర్వసాధారణమని, అప్పగించిన విధులను సమర్థవంతంగా, అంకితభావంతో నిర్వర్తించినప్పుడే సార్థకత ఉంటుందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని ఉద్యోగోన్నతులు పొందాలని ఆకాంక్షించారు. అదనపు ఎస్‌పి శ్రీనివాసరావు మాట్లాడుతూ తనకు జిల్లాలో అధికారులు, కిందిస్థాయి ఉద్యోగులు ఎంతగానో సహకరించారని చెప్పారు. అనంతరం జిల్లా పోలీస్ శాఖ తరపున ఎస్‌పి దుశ్శాలువతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న హేమమాలిని, అధికారులు

మరిన్ని వార్తల కోసం
epaper.prajasakti.com

ఆలోచనా ధోరణి మారాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సమాజంలో స్త్రీ, పురుషులు ఇద్దరూ సమానమేనని, ఈ విషయంలో ప్రజల ఆలోచనా ధోరణి మారాలని మహిళా ఆర్థిక సంస్థ చైర్‌పర్సన్ బి.హేమమాలిని రెడ్డి అన్నారు. పని ప్రదేశాల్లో మహిళలపై హింస, వివక్ష, లైంగిక వేధింపుల నివారణపై సమన్వయ సమావేశాన్ని మహిళా,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యాన జెడ్‌పి సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు లైంగిక వేధింపులకు, వివక్షకు గురైతే చట్టాలను వినియోగించుకోవాలని కోరారు. మహిళలు పనిచేసే ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాల్లో ఫిర్యాదుల కమిటీని తప్పక ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి మాట్లాడుతూ మహిళల పరిరక్షణ కోసం లైంగిక వేధింపుల నివారణ చట్టం రూపొందించబడిందన్నారు. మహిళా చట్టాలపై గ్రామ సచివాలయ స్థాయి వరకు తీసుకువెళ్లాలన్నారు. తొలుత మహిళల లైంగిక వేధింపుల నివారణపై ప్రతిజ్ఞ చేసి, పోస్టర్‌ను ఆవిష్కరించారు. సదస్సులో బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ యు.శ్రీలక్ష్మి, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్, డిఆర్‌డిఎ, సమగ్ర శిశు సంరక్షణ పీడీలు డి.వి విద్యాసాగర్, కె.వి.రమణ, మహిళాభివద్ధి, శిశు సంక్షేమ శాఖాధికారి కె.అనంతలక్ష్మి, దిశ పోలీస్ స్టేషన్ ఎస్ఐ బి.లలిత తదితరులు పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి ప్రభుత్వ ప్రాధాన్యత

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

శ్రీకాకుళం : క్రీడల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. నగరంలోని కోడి రామ్మూర్తి క్రీడా ప్రాంగణంలో జిల్లాస్థాయిలో నిర్వహించిన సిఎం టోర్నమెంట్ కప్ విజేతలకు శుక్రవారం ప్రైజ్‌మనీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడలకు మునుపటి రోజులు వచ్చాయన్నారు. పాఠశాల స్థాయిలో క్రీడాకారులు తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించే వారన్నారు. క్రమంగా క్రీడారంగాన్ని విస్మరించడం వల్ల ప్రతిభ గల క్రీడాకారుల సంఖ్య తగ్గిందన్నారు. ఉన్నత స్థాయి నైపుణ్యత గల క్రీడాకారులను వెలికితీసే ఉద్దేశంతో శాప్ ఆధ్వర్యాన జిల్లాస్థాయి సిఎం కప్ టోర్నమెంట్ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడల్లో నైపుణ్యం కలిగిన వారికి ఉద్యోగ నియామకాల్లోనూ అవకాశాలు లభిస్తున్నాయన్నారు.

జల జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ మంచినీరు

ప్రజాశక్తి - ఆమదాలవలస

జల జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని రూ.1.39 కోట్లతో జల జీవన్ మిషన్ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. మండలంలోని కలివరం పంచాయతీ పరిధిలోని కంచరాపువారిపేట, ముద్దాడపేట, పీరుసాహెబ్‌పేటలో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ మంచినీటి కుళాయిలకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జల జీవన్ మిషన్ కింద తొలి విడతలో రూ.125 కోట్లు, తర్వాత మరో రూ.30 కోట్లను ప్రభుత్వం కేటాయించిందన్నారు. గత ప్రభుత్వాలు ప్రవేశపెట్టలేనన్ని సంక్షేమ పథకాలను రాష్ట్రంలో అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. త్వరితగతిన పనులను పూర్తి చేసి ప్రజలకు త్వరలోనే తాగునీరు అందించాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిపి తమ్మినేని శారద, వైసిపి యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, తొగరాం సర్పంచ్ తమ్మినేని వాణి, వైస్ ఎంపిపి సోమరాజు జగన్నాథరావు, పిఎసిఎస్ అధ్యక్షులు జి.శ్రీనివాసరావు, డిసిఎంఎస్ డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు, సర్పంచ్ బండి ఉమ, తహశీల్దార్ వై.వి పద్మావతి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జల జీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ సీతారాం

కాంగ్రెస్ పూర్వ వైభవానికి కృషి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవానికి కృషి చేస్తున్నామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు బొడ్డేపల్లి సత్యవతి అన్నారు. నగరంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో శాసనసభలో కాంగ్రెస్ కండువాలు కనిపిస్తాయన్నారు. పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు ఆధ్వర్యాన కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీకి కష్టాలు కొత్త కాదని, ఎన్నోసార్లు కష్టాల నుంచి బయటపడి ప్రజలకు సమర్థవంతమైన పాలన అందించిందన్నారు. రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి నాయకత్వాన ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అందించినట్లు తెలిపారు. ఆయన వారసునిగా చెప్తున్న జగన్ బిజెపి పంచన చేరి ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నారని విమర్శించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలపై భారాలను మోపుతోందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటీకరిస్తోందని విమర్శించారు. సమావేశంలో పార్టీ నాయకులు సనపల అన్నాజీరావు, దేశెళ్ల గోవింద మల్లిబాబు, అంబటి కృష్ణారావు, ఆర్.సురేష్, పైడి నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సత్యవతి

విశాఖ రాజధానితోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి

రెవెన్యూ మంత్రి ధర్మాన

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

విశాఖ రాజధానితోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఇచ్ఛాపురంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో శుక్రవారం పాల్గొన్న ఆయన వైఎస్‌ఆర్ టూరిజం పార్క్ వద్ద మూడు రాజధానులకు మద్దతుగా నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడారు. రాజధానికి అన్ని యోగ్యతలు ఉన్న నగరం విశాఖపట్నం అని స్పష్టం చేశారు. గతానుభవాలను దృష్టిలో పెట్టుకుని శివారామకృష్ణన్ కమిటీ అభివృద్ధి వికేంద్రీకరణ చేయాలని నివేదిక ఇచ్చినా, చంద్రబాబు నాయుడు అమరావతిని రాజధానిగా ప్రకటించారని చెప్పారు. అమరావతి పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం సాగించారని విమర్శించారు. రాజధానికి వేల ఎకరాలు అవసరం లేదని, 500 ఎకరాల్లో రూ.15 వేల కోట్లు రాజధాని నిర్మాణానికి సరిపోతుందన్నారు. వచ్చిన పెట్టుబడులన్నీ ఒక్క అమరావతిలోనే పెట్టేస్తే ఎలా అని ప్రశ్నించారు. గతంలో హైదరాబాద్‌లో పెట్టుబడులన్నీ పెట్టడంతో ఇప్పుడు ఆ ప్రాంతాన్నే వదులుకోవాల్సి వచ్చిందన్నారు. వెనుకబడిన ఉత్తరాంధ్రకు రాజధాని అవకాశం వచ్చిందని, అందరూ ఏకమై వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మూడు రాజధానుల ఏర్పాటును అందరూ బలపరచాలన్నారు. గత ప్రభుత్వ తప్పును జగన్ సరిదిద్దుతున్నారని చెప్పారు. దేశంలో ఎనిమిది రాష్ట్రాలు ఇదే విధానాన్ని పాటిస్తున్నాయని తెలిపారు.

వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ మూడు రాజధానులతోనే అన్ని ప్రాంతాల అభివృద్ధి సాధ్యమన్నారు. జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ మాట్లాడుతూ మూడు రాజధానులను వ్యతిరేకిస్తున్న ప్రతిపక్షాలకు పుట్టగతులు ఉండవన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సభలో జెఎసి కన్వీనర్ హెచ్.లజతిరాయ్, వైసిపి నాయకులు పిరియా సాయిరాజ్, దానేటి శ్రీధర్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు ఉలాల భారతి దివ్య, లాభాల స్వర్ణమణి, కార్పొరేషన్ల చైర్మన్లు నర్తు రామారావు, శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, మామిడి శ్రీకాంత్, డి.లోకేశ్వరరావు, నిమ్మాన దాసు, నర్తు నరేంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


ఇచ్ఛాపురం మున్సిపాల్టీలో రూ.58.83 కోట్లతో తాగునీటి సరఫరా పథకం పనులకు మంత్రి ధర్మాన శంకుస్థాపన చేశారు. రూ.1.04 కోట్లతో నిర్మించిన మహిళా జూనియర్ కళాశాల గదులను ప్రారంభించారు. వైఎస్‌ఆర్ టూరిజం పార్క్ ఆధునీకరణకు రూ.75 లక్షలతో చేపట్టే పనులకు శంకుస్థాపన చేశారు. జ్ఞానభారతి విద్యాసంస్థలో కొత్తగా ప్రవేశపెట్టిన ఆర్‌ఎఫ్ఐఎస్ అటెండెన్స్ విధానాన్ని ప్రారంభించారు.



మాట్లాడుతున్న రాష్ట్ర రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

వ్యవసాయానికి ప్రభుత్వం పెద్దపీట

స్పీకర్ తమ్మినేని సీతారాం



ప్రజాశక్తి - పొందూరు

వ్యవసాయ రంగానికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని ధర్మపురం గ్రామంలో వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్ అధ్యక్షతన శుక్రవారం వైసిపి మండల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయానికి సాగునీరు ప్రాణాధారమని అటువంటి సాగునీరు అందించేందుకు నీటిప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. మండలంలోని రూ.7 కోట్లతో నిర్మించిన లైదాం ఎత్తిపోతల పథకం ఈ నెల 27న ప్రారంభిస్తామని చెప్పారు. అనంతరం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ లబ్ధిదారులకు అందుతున్న సంక్షేమ పథకాలను ఆయన వివరించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, సర్పంచ్ మొదలవలస పాపారావు, ఎంపిపి ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, ఎంఎంసి చైర్మన్ సునీల్‌కుమార్, పొందూరు పట్టణ అధ్యక్షులు నాగరాజు, గుడ్ల మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల వద్దకే పథకాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ప్రజాశక్తి - లావేరు

ఏ ప్రభుత్వ పథకం కావాలన్నా గతంలో ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ కార్యాలయాల చుట్టూ తిరిగేవారని, సిఎం చొరవతో నేరుగా ప్రభుత్వ పథకాలు ప్రజల వద్దకే చేరుతున్నాయని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని అప్పాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులకు అందించిన పథకాల వివరాలు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ సమస్యలున్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని అన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి ఎం.సీతంనాయుడు, ఎఇ మహేష్‌నాయుడు, హౌసింగ్ ఎఇ అప్పలనాయుడు, ఎపిఎం మాధవిలత, సర్పంచ్ జగ్గురోతు నాగరత్నం, వెంకటాపురం సర్పంచ్ బి.అరుణ, ఎల్లంనాయుడు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

'మిత్ర' సేవలు అభినందనీయం

నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు

శ్రీకాకుళం అర్బన్ : మిత్ర ఫౌండేషన్ సేవలు అభినందనీయమని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు అన్నారు. శుక్రవారం నగరంలోని గ్రాండ్ హోటల్‌లో మిత్రా ఫౌండేషన్ సక్సెస్ మీట్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల ఆర్ట్స్ కళాశాల మైదానంలో మిత్రా ఫౌండేషన్ ఆధ్వర్యాన కార్తీక మాసం పురష్కరించుకుని మహా రుద్రాభిషేకం నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. స్వచ్ఛ శ్రీకాకుళం సాధనలో జాతీయ అవార్డు పొందేలా మిత్రా ఫౌండేషన్ లాంటి ఎన్నో ఎన్‌జిఒలు సహకారం అందించాయన్నారు. ప్రభుత్వం, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు సమిష్టిగా కార్యక్రమాలు చేస్తే అవి తప్పక మంచి ఫలితాలు ఇస్తాయన్నారు. మిత్రా ఫౌండేషన్ అధ్యక్షులు దుప్పల వెంకటరావు, మిత్రా ఫౌండేషన్ సభ్యులు సుగుణాకర్, గీతా శ్రీకాంత్, గుంట తులసీరావు, జయరాం, నగర ప్రముఖులు అరుణ, మెట్ట మధు, చింతాడ రామ్మోహన్, కోత తిరుమలరావు, తదితరులు పాల్గొన్నారు.

చేనేతకు పూర్వ వైభవం తెస్తాం

బూర్జ: చేనేత కార్మికులకు పూర్వ వైభవం జనసేనతోనే సాధ్యమని కొత్తకోట నాగేంద్ర అన్నారు. శుక్రవారం చిన్న కురంపేటలో జనంతో జనసేన నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేంద్ర, కోరుకొండ మల్లేశ్వరావు, ఎంపిటిసి విక్రమ్, చిన్న సాయిభవాని ఆధ్వర్యంలో గడప గడపకు వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. చేనేతల కష్టాలు, వారి బాధలు తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో పవన్ కళ్యాణ్‌ను సిఎం చేస్తే పాత రోజులు వస్తాయని, మీకు అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంఅలో జనసేన నాయకులు సైరిగాపు సంతోష్‌నాయుడు, కోమల్, మోహన్, కిరణ్ రుద్ర, సాయి, అభి, మహేష్, ప్రదీప్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సిఎం దృష్టికి నియోజకవర్గ సమస్యలు



మాట్లాడుతున్న గాంధీ

ప్రజాశక్తి - ఆమదాలవలస

నరసన్నపేటలో బహిరంగసభకు విచ్చేసిన సిఎం జగన్మోహన్‌రెడ్డి దృష్టికి ఆమదాలవలస నియోజకవర్గ సమస్యలు తీసుకెళ్లినట్లు వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సువ్వారి గాంధీ అన్నారు. శుక్రవారం బొడ్డేపల్లిపేట వైసిపి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆమదాలవలస నియోజకవర్గంలో దశాబ్దాల తరబడి పరిష్కారం కాని సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. 38 ఏళ్ల క్రితం ఆమదాలవలసలో ఆర్ట్స్ గ్రూపులతో డిగ్రీ కళాశాల ప్రారంభించారని, ఇప్పటివరకు ఎన్ని ప్రభుత్వాలు మారినా సైన్స్ గ్రూపులను ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు. దీన్ని ప్రైవేటు కళాశాలలు సొమ్ము చేసుకుంటున్నాయని చెప్పారు. పొందూరు మండలంలో క్రీడాకారుల కోసం మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని, బూర్జ మండలం ఓనిగెడ్డను మినీ రిజర్వాయరుగా మర్చి, తోటపల్లి కాలువకు అనుసంధానం చేయాలి అని జగన్‌కు వినతిపత్రం అందించినట్లు చెప్పారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ సందర్భంగా సిఎం జగన్‌కు గాంధీ కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో వైసిపి నాయకులు పేడాడ వైకుంఠరావు, బత్తుల లక్ష్మణరావు, పైడి విజయ రమణారావు, బి.రాజేష్, ముల్లు ధర్మారావు, గురుగుబెల్లి రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మెనూ అమలు తప్పనిసరి



వంటలను పరిశీలిస్తున్న సర్పంచ్ సంజీవరావు

కోటబొమ్మాళి: జగనన్న గోరుముద్ద మెనూ తప్పనిసరిగా పాటించాలని కోటబొమ్మాళి మేజరు పంచాయతీ సర్పంచ్ కాళ్ల సంజీవరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్‌పి బాలుర పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం రుచికరంగా విద్యార్థులకు వండి పెట్టాలని వంట నిర్వాహకులకు సూచించారు. నిర్వాహకులకు ఏదైన సమస్య ఉంటే తనకు తెలిజేయాలని, విద్యార్థులకు మాత్రం మెనూ ప్రకారం వంటను వడ్డించాలని అన్నారు. చాలా పాఠశాలల్లో వంట రుచిగా వండని నిర్వాహకులపై చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆయన వెంట హెచ్‌ఎం పైడి పోలినాయుడు, పట్టణ అధ్యక్షులు డి.ప్రదీప్‌కుమార్, వైసిపి నాయకులు చిరంజీవి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు సహకారం



జాతీయ సదస్సులో గీతా శ్రీకాంత్

శ్రీకాకుళం అర్బన్: ఉత్తరాంధ్రలో ఉన్న గిరిజన, మహిళలు జాతీయ స్థాయిలో పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళికను రూపొందిస్తున్నట్లు కోవే ఉత్తరాంధ్ర సెక్రెటరీ డాక్టర్ యార్లగడ్డ గీతా శ్రీకాంత్ తెలిపారు. తమిళనాడులోని కూనూర్‌లో వెల్లింగ్టన్ క్లబ్ ఆధ్వర్యాన కోవే ఇండియా 18వ ఆవిర్భావ వేడుకలతో పాటు జాతీయస్థాయి సమావేశం ఈ నెల 22న జరిగింది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుండి 30 మంది మహిళా పారిశ్రామికవేత్తలు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి గీతా శ్రీకాంత్ హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో ఉన్న గిరిజన, మహిళలను జాతీయస్థాయిలో పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు తన వంత ప్రోత్సాహం ఉంటుందన్నారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో గిరిజన ఉత్పత్తులకు దేశవ్యాప్తంగా అమ్మకాలు జరిగేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. భవిష్యత్‌లో కొన్ని కళాశాలలను అనుసంధానం చేసుకొని యువతి, యువకులను వ్యాపార రంగం వైపు ఆసక్తి కలిగించే ఉచిత శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు ఆమె వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు రాధిక చౌదరి మాట్లాడుతూ దేశం మొత్తం మీద ఉన్న గిరిజన పారిశ్రామికవేత్తలను కోవే ద్వారా సమన్వయం చేసి గిరిజన మహిళా పారిశ్రామికవేత్తలకు చేయూతను అందించినట్లు తెలిపారు. సమావేశానికి కోవే జాతీయ అధ్యక్షులు మధు త్యాగి, జాతీయ కార్యవర్గ సభ్యులు అపర్ణ, లలిత, సుమన్, సౌదామని హాజరయ్యారు.

పాలనలో రుగ్మతలు తొలగించాం

మంత్రి ధర్మాన ప్రసాదరావు



మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - కవిటి

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ మూడున్నర ఏళ్ల కాలంలో పాలనలో ఉన్న అనేక రుగ్మతలను సంస్కరణల ద్వారా తొలగించిందని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. మండలంలోని శిలగాం గ్రామంలో నూతనంగా నిర్మించిన పశు వైద్యశాల, సచివాలయం, ఆర్‌బికెను మంత్రి ధర్మాన ప్రారంభించారు. అనంతరం బల్లిపుట్టుగ గ్రామంలో జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలనలోని అన్ని విభాగాల్లో అనుమతులు మంజూరు, సంక్షేమ పథకాలు రూపొందించడం, అవి అర్హులకు అందేలా చర్యలు తీసుకోవడం, పనులు కేటాయించడం వంటి విభాగాల్లో గణనీయమైన మార్పులు తీసుకొచ్చినట్టు తెలిపారు. పార్టీ ముద్ర, మధ్యవర్తుల జోక్యం లేకుండా, కుల, మత, ప్రాంతీయ భేదాలు, అవినీతి లేకుండా అర్హతే ఆధారంగా సంక్షేమ పథకాలు అమలు చేయడం అతిపెద్ద మార్పు అని అన్నారు. ఒక్క అవినీతి మరక లేకుండా సంక్షేమ పథకాలు పంపిణీ చేయడం దేశంలోనే ఆదర్శనీయమని అన్నారు. రెవెన్యూ వ్యవస్థలో కూడా పూర్తిస్థాయిలో మార్పులు చేస్తున్నారని, భూసర్వే ద్వారా గత వందేళ్లుగా పరిష్కారం కాని ఎన్నో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పిస్తున్నట్లు తెలిపారు. తహశీల్దార్ కార్యాలయంలో జరిగే జాప్యం, అవినీతి ఉంటే నిర్మూలించేలా, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పారదర్శికత కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న 350 రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు రాబోయే రోజుల్లో మరో 2వేలు కార్యాలయాలు కలిసే ప్రతిపాదనలు ఉన్నట్టు తెలిపారు. ప్రతి సచివాలయం రాబోయే రోజుల్లో ఒక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంగా మారుతుందని మంత్రి తెలిపారు. దీనిద్వారా రైతులు ఇబ్బంది పడుతున్న మ్యూటేషన్ వ్యవస్థలో పూర్తి పారదర్శక లభిస్తుందని మంత్రి తెలిపారు. జిల్లాలో కిడ్నీ బాధిత ప్రాంతాలకు రూ.700కోట్ల రూపాయలతో సురక్షిత మంచినీరు అందించే పథకం మరో నాలుగు నెలల్లో అందుబాటులోకి రానుందని మంత్రి తెలిపారు. ఇటువంటి పరిస్థితుల్లో ఏం చేయాలో తెలియక ధరలు పెరిగిపోయాయి అంటూ టిడిపి బాదుడే బాదుడు అంటూ తిరుగుతోందని, కానీ ధరల నియంత్రణ అనేది కేంద్రం చేతిలోని అంశమని, మిగతా రాష్ట్రాలతో పోలిస్తే మన రాష్ట్రంలోనే కూరగాయలు ధరలు తక్కువని మంత్రి అన్నారు. ఇప్పటికైనా టిడిపి నాయకులు వాస్తవాలు గ్రహించి జిల్లాకు ఉపయోగపడే పనులు, ప్రకటనలు చేయాలని హితవుపలికారు. ఇప్పటికైనా జిల్లాకు చెందిన టిడిపి నాయకులు జిల్లాకు మంచి జరిగే ఆలోచనలు చేయాలని, మంచిని వ్యతిరేకించే పనులు చేయడం కానీ, దద్దమ్మలు అంటూ పనికిమాలిన విమర్శలు చేయడం కానీ మానుకోవాలని ధర్మాన హితవు పలికారు. సమావేశంలో వైసిపి జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ, నాయకులు పిరియా సాయిరాజ్, నర్తు రామారావు, శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, కడియాల పద్మ ప్రకాష్, పూడి నేతాజీ, పూడి లక్ష్మణరావు, బెండాళం జయప్రకాష్, పులకల శ్రీరాములు, రజనీకుమార్ దొలై, తదితరులు పాల్గొన్నారు.



పొందూరు: మాట్లాడుతున్న ఎంఇఒ శ్రీనివాసరావు



పొందూరు: కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

ప్రజాశక్తి - పలాస

మానసిక ఉల్లాసానికే క్రీడలు దోహదపడతాయని, తద్వారా మంచి విద్యను అభ్యసించవచ్చని ఎంఇఒ శ్రీనివాసరావు అన్నారు. పలాస జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో తొలిసారి మండలస్థాయిలో గ్రిగ్స్ సీనియర్, జూనియర్ బాలబాలికలకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో ఆరోగ్యమే కాకుండా, విద్య, ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవచ్చని అన్నారు. అధ్యక్షులుగా ఆర్.రాజ్యలక్ష్మి, నియోజకవర్గ క్రీడల సమన్వయకర్త పి.తవిటయ్య కార్యదర్శి నివేదిక చదివారు. కార్యక్రమంలో పెంట కృష్ణప్రసాద్, బద్రి గోపాలు, విద్యా కమిటీ చైర్మన్ ఎల్.శ్రీనివాసరావుతో పాటు హరిబాబు, పద్మలోచనం, దీనబంధు, మహేష్, రాంజీ, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీనియర్ విభాగంలో బాలురు, కాశీబుగ్గ, బొడ్డపాడు, బాలికల విభాగంలో ఎమ్‌జెబి పలాస, రంగోయి జూనియర్ విభాగంలో బాలురు చినబడాం, బ్రాహ్మణతర్లా, బాలికల విభాగంలో ఎమ్‌జెబి పలాస, బొడ్డపాడు జోనల్ మీట్‌కు ఎన్నికయ్యారు.

గ్రిగ్స్ పోటీలు ప్రారంభం

పొందూరు: పొందూరు మండలం పిల్లలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం సుగ్గు కాసులబాబు ఆధ్వర్యంలో శుక్రవారం మండల స్థాయి గ్రిగ్స్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజులపాటు జరిగే ఈ పోటీల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలను నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొనడంతో పాఠశాలలో పండగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో పి.వి.రామరాజు, సర్పంచ్ బుడుమూరు పోలినాయుడు, పిఎంసి చైర్మన్ గురుగుబిల్లి వరాహ నరసింహం, గ్రామ పెద్దలు, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై ధరల బాదుడే బాదుడు

టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్



బాదుడే బాదుడులో పాల్గొన్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - ఆమదాలవలస

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజలపై ధరల బాదుడే బాదుడును కొనసాగిస్తున్నారని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. పురపాలక సంఘ పరిధిలోని 23వ వార్డు వెంకయ్యపేటలో టిడిపి కార్యకర్తలతో కలిసి బాదుడే బాదుడు నిర్వహించారు. వార్డులోని ఇంటింటికీ వెళ్లి వైసిపి ప్రభుత్వ పాలనలో ధరల బాదుడును ప్రజలకు వివరించారు. మహిళా రైతు హనుమంతు ఝాన్సీ మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వ హయాంలో ధాన్యానికి మద్దతుధర ఇచ్చి సక్రమంగా కొనుగోలు చేసి రైతుల ఖాతాలో డబ్బులను జమ చేసేవారని, సంక్రాంతిని సంబరంగా జరుపుకునే వారమని తెలిపింది. కానీ నేడు ఆ పరిస్థితి కనబడడం లేదని రవికుమార్ వద్ద వాపోయింది. అటువంటి పరిస్థితులు మళ్లీ రావాలంటే నారా చంద్రబాబు నాయకత్వంలోని టిడిపి ప్రభుత్వాన్ని గెలిపించాలని అన్నారు. టిడిపి హయంలో విద్యుత్ ధరలను పెంచనేలేదని కానీ నేటి ప్రభుత్వం పలుమార్లు విద్యుత్ ధరలను పెంచి ప్రజలపై బాదుడే బాదుడును కొనసాగిస్తున్నారని ఎద్దేవా చేశారు. 300 యూనిట్లు దాటితే సంక్షేమ పథకాలకు ఈ ప్రభుత్వం కోత పెడుతోందని, టిడిపి ప్రభుత్వంలో అలా ఉండేదా అని ప్రజలను కూన ప్రశ్నించారు. రానున్న ఎన్నికలలో ఈ అరాచక ప్రభుత్వాన్ని సాగనంపి ప్రజల హితం కోరే తెలుగుదేశం పార్టీని గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ తమ్మినేని గీత, తమ్మినేని సుజాత, శిమ్మ మాధవి, టిడిపి నాయకులు సనపల ఢిల్లేశ్వరరావు, తమ్మినేని చంద్రశేఖర్, తమ్మినేని విద్యాసాగర్, అమర్నాథ్, బోర గోవిందరావు, కొండబాబు, నేతింటి జ్యోతి, అన్నెపు భాస్కరరావు, సనపల చెల్లంనాయుడు, గొండు రమణ, ఎండ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం సందర్శన

మెళియాపుట్టి: మండలంలో భరణికోట గ్రామ సచివాలయాన్ని డిఎల్‌డిఒ అలివేలు మంగమ్మ శుక్రవారం సందర్శించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అన్ని శాఖల సిబ్బంది రికార్డు సక్రంగా నిర్వహించాలన్నారు. ప్రతి రోజూ మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఐదు గంటల వరకు స్పందన నిర్వహించాలన్నారు. ఎస్‌డిజి, పిఎంజెఎవై సర్వేపై ఇళ్ల నిర్మాణం, ప్రభుత్వ భవన నిర్మాణాలపై సమీక్షించారు.

భవన నిర్మాణాలపై హైకోర్టు స్టేటస్ కో

పొందూరు: మండలంలెని గోకర్ణపల్లి గ్రామంలో సర్వేనంబరు 96-24లో నిర్మిస్తున్న వెల్నెస్ సెంటర్, రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలపై రాష్ట్ర అత్యున్నత న్యాయ స్థానం స్టేటస్ కో ఇచ్చినట్లు శుక్రవారం మాజీ ఎంపిటిసి సీపాన శ్రీరంగనాయకులు తెలిపారు. ఈ భూమిని రెవెన్యూ అధికారులు వెల్నెస్ కేంద్రం, రైతు బరోసా కేంద్రాల నిర్మాణానికి కేటాయించారు. దీనిపై కొంతమంది రైతులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో భవన నిర్మాణ పనులను యథాతథంగా నిలిపివేయాలంటూ స్టేటస్ కో ఇచ్చిందని అన్నారు.

క్షణికావేశంలో...

వేర్వేరు చోట్ల ఇద్దరు వివాహితుల ఆత్మహత్య

ప్రజాశక్తి - జి సిగడాం


కట్టుకున్న భర్తతో మనస్పర్థలు కారణంగా క్షణికావేశంలో ఒకరు ఫ్యానుకు ఉరివేసుకోగా, మరొకరు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ హృదయ విదారకర ఘటనలు జి.సిగడాం, వజ్రపుకొత్తూరు మండలాల్లో చోటు చేసుకున్నాయి.

వారు ఒకరిని ఒక్కరు ప్రేమించుకున్నారు. పెద్దలను ఒప్పించి మరీ పెళ్లి చేసుకున్నారు. ఎనిమిదేళ్లుగా వారి కాపురం సాఫీగా సాగింది. ఇంతలో ఏమైందో ఏమో రెండు నెలలుగా భార్యా, భర్తల మధ్య మనస్పర్థలు తలెత్తాయి. క్షణికావేశంలో వివాహిత ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండలంలోని ఆనందపురంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఆనందపురం గ్రామానికి చెందిన చిత్తిరి గౌతమి(23) అదే గ్రామానికి చెందిన సత్యనారాయణ ప్రేమించి, పెళ్లి చేసుకున్నారు. వీరికి పిల్లలు తేజస్విని, షణ్ముఖనాయుడు ఉన్నారు. రోజూ మాదిరిగానే పిల్లలు స్కూల్‌కు వెళ్లారు. భర్త సత్యనారాయణ గ్రామంలో పొలం పనులకు వెళ్లిపోయారు. ఉదయం 9గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో గౌతమి ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఉదయం వేళ తలుపులు వేసి ఉండటాన్ని గుర్తించిన కుటుంబసభ్యులు వెళ్లి చూడగా గౌతమి ఫ్యాను ఉరివేసుకొని కనిపించింది. స్థానికుల సహాయంతో తలుపులు బద్దలుకొట్టి మృతదేహాన్ని కిందకు దించారు. విషయం తెలుసుకున్న మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు బోరున విలపించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఎస్.రామారావు గ్రామానికి చేరుకొన్నారు. క్లూస్ టీమ్‌ను రప్పించి, ఆధారాలు సేకరించారు. తన కుమార్తె మృతికి అల్లుడు కారణమని గౌతమి తండ్రి రవణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సత్యనారాయణను అదుపులోకి తీసుకున్నారు. జెఆర్‌పురం సిఐ కేసుదర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజాం సామాజిక ఆస్పత్రికి తరలించారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పెట్రోల్ పోసుకొని..



దేవిక (ఫైల్)

వజ్రపుకొత్తూరు, టెక్కలి రూరల్ : పూండిలో నివాసం ఉంటున్న పైల దేవిక (29) పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం ప్రకారం.. టెక్కలి మండలం బూరగాం పంచాయతీత నాయుడుపేటకు చెందిన దేవిక వజ్రపుకొత్తూరు మండలం సూర్యవంశపురానికి చెందిన పైల కామేశ్వరరావుతో మూడేళ్ల క్రితం వివాహమైంది. బాధితురాలికి గతంలో పలాస మండలం శాసనం గ్రామానికి చెందిన వ్యక్తితో వివాహమైంది. తొలి భర్త చనిపోవడంతో కుటుంబసభ్యులు కుమార్తెతో ఉన్న ఆమెకు ఎచ్చెర్ల మండలానికి చెందిన వ్యక్తితో వివాహం చేశారు. ఆ తరువాత సమీప బంధువైన కామేశ్వరరావుతో పరిచయం ఏర్పడటంతో వివాహం చేసుకున్నారు. వీరికి ఒక కుమార్తె ఉంది. పూండిలో వారు నివాసం ఉంటున్నారు. కామేశ్వరరావు మర్చెంట్ నేవీలో పనిచేస్తున్నాడు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో క్షణికావేశంలో గురువారం రాత్రి పెట్రోల్ పోసుకొని నిప్పు పెట్టుకుంది. కుటుంబ సభ్యులు ఆమెను టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమించి ఆమె శుక్రవారం ఉదయం మృతి చెందింది. వజ్రపుకొత్తూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మాట్లాడుతున్న పురుషోత్తంనాయుడు

ఐక్యతతోనే సమస్యల పరిష్కారం

ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర సహాధ్యక్షులు పురుషోత్తంనాయుడు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

సమష్టిగా ఉంటేనే ఉద్యోగుల సమస్యల పరిష్కారం సాధ్యపడుతుందని ఎపి ఎన్‌జిఒ సంఘం రాష్ట్ర సహధ్యక్షులు చౌదరి పురుషోత్తంనాయుడు అన్నారు. శ్రీకాకుళం నగర యూనిట్ సంఘ ఎన్నికల గడువు సమీపిస్తున్న తరుణంలో యూనిట్ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలను సంఘ నేతలు విస్తృతంగా పర్యటిస్తూ.. ఉద్యోగులను ఎన్నికలకు సమాయత్తం చేస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం జిల్లా విద్యా శాఖ, రాష్ట్ర ఆడిట్ శాఖ, ఎక్సైజ్ శాఖ కార్యాలయాలను సందర్శించారు. ఆయా కార్యాలయాల్లో ఉద్యోగులను కలిసి ఎన్నికలకు హాజరుకావాలని పిలుపునిచ్చారు. పురుషోత్తంనాయుడు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హనుమంతు సాయిరాం, చల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ 70 ఏళ్ల చరిత్రగల ఎన్‌జిఒ సంఘం రాజకీయాలు, పార్టీలకు అతీతంగా పనిచేస్తోందన్నారు. ఏ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ, ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా ముందుకు వెళ్తున్నామని, ఏ పార్టీకి కొమ్ము కాయడం లేదని పునరుద్ఘటించారు. ప్రస్తుత ప్రభుత్వం ఉద్యోగులకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటున్నప్పటికీ కొత్తగా పుట్టుకొస్తున్న సంఘాలు ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తుండడంతో ప్రభుత్వంపై సమస్యల పరిష్కారానికి ఒత్తిడి తేలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారంలో సంఘ నాయకులనే దోషులుగా ప్రభుత్వం చిత్రీకరించిందని స్పష్టం చేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం, డిమాండ్ల సాధనకు ఐక్య ఉద్యమం తప్పదని పేర్కొన్నారు. ఈ క్రమంలో జరుగుతున్న ఎన్నికల్లో ఉద్యోగులంతా పాల్గొని ఐక్యతను చాటిచెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు రాయి వేణుగోపాల్, బొత్స శ్రీనివాసరావు, బడగల పూర్ణచంద్రరావు, రవీంద్రకుమార్, ఐ.చిట్టిబాబు, ఎం.భూపాలరావు, ఎస్.అప్పలకొండ, రాంబాబు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్ల రక్తదానం



రక్తదానం చేస్తున్న సీనియర్ సిటిజన్లు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

నగరంలోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో శ్రీకాకుళం హౌసింగ్ బోర్డ్ కాలనీలో గల శంకర నారాయణ మెడికల్స్ ప్రాంగణం లో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో 26 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బి.మల్లేశ్వరరావు, అసోసియేట్ అధ్యక్షులు కె.సోమసుందరరావు , కోశాధికారి పి.ఎస్ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

28న వాహనాల వేలం

కోటబొమ్మాళి: వివిధ కేసుల్లో పట్టుబడి పోలీస్ స్టేషన్‌లో ఉన్న మూడు వాహనాలను ఈ నెల 28న ఉదయం 10 గంటలకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ షేక్ ఖాదర్ భాషా తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అక్రమంగా మద్యం తరలిస్తుండగా ఒక టివిఎస్, రెండు స్కూటీలను పట్టుకున్నామని చెప్పారు. వీటిని వేలం వేయనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు పాటలో పాల్గొనాలని కోరారు.



ప్రతిభా అవార్డును అందజేస్తున్న గణపతి

విద్యార్థి దశ కీలకం

సోంపేట: జీవితంలో విద్యార్థి దశ ఎంత కీలకమైనదని, ఈ దశలో తీసుకున్న నిర్ణయాలే జీవితంలో ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంటాయని ప్రముఖ మనో వికాస నిపుణుడు రాంబుడ్డి గణపతి అన్నారు. మండలంలోని కొర్లాం గ్రామంలో శుక్రవారం జాగృతి సంస్థ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతమైన గుణగణాలను అలవర్చుకొని, సమాజానికి హితంచేసే పనులపై దృష్టి సారించాలన్నారు. సామాజిక బాధ్యత కలిగి ఉండి, సమాజ చైతన్యంలో భాగస్వాములు కావాలన్నారు. చెడు వ్యసనాలకు లోనుకాకుండా ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పరచుకొని వాటి సాధన కోసం కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా మనో వికాస నిపుణుడు పుక్కల్ల చిరంజీవి, కవి గుమ్మడి సాంబమూర్తి, నాట్య కళాకారిణి ఎం.సుదీప్న కుమారికి ప్రతిభా అవార్డులను అందజేశారు. లైన్స్ క్లబ్ సభ్యుడు టి.కృష్ణమూర్తికి కీర్తిశేషులు గండు తులసినారాయణ స్మారక అవార్డుతోపాటు రూ.5వేల నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బి.వెంకటరమణ, ఇఒపిఆర్‌డి వాసుదేవరావు, ఇంజినీరింగ్ అధికారి రమేష్, ప్రిన్సిపాల్ లక్ష్మణరావు, బి.బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి దారుణ హత్య

పర్లాకిమిడి: గజపతి జిల్లా కాశీనగర్ బ్లాక్ కిడిగాం గ్రామంలో గురువారం అర్ధరాత్రి దుండగులు గుర్తుతెలియని వ్యక్తిని హత్య చేశారు. దుండగులు గ్రామంలోని ప్రజల ఇళ్ల తలుపులను సారా కోసం కొట్టారని, అదే సమయంలో గుర్తుతెలియని వ్యక్తిపై దాడి చేయడంతో ఆయన దుర్మరణం చెందాడు. ఈ ఘటనలో మరొరు గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ఐఐసి సుశాంత్ సాహు ఆధ్వర్యాన పోలీసులు గాయపడిన వ్యక్తిని కాశీనగర్ సుమూహ ఆస్పత్రిలో చేర్పించి, చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం పర్లాకిమిడి జిల్లా ఆస్పత్రికి తరలించారు.

బంగారు గొలుసు చోరీ

ప్రజాశక్తి - ఆమదాలవలస

పట్టణంలోని వరదావారి క్వార్టర్స్‌కు చెందిన కోరాడ స్వాతికి చెందిన ఒకటిన్నర తులాల బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి తెంపుకొని పారిపోయాడు. పోలీసుల కథనం ప్రకారం.. స్వాతిని అడ్రస్ అడిగేందుకు వచ్చిన వ్యక్తి ఆమె మెడలోని గొలుసును తెంపుకుపోయాడు. ఆమె కేకలు వేసినా ఫలితం లేకపోయింది. ఎస్ఐ అహ్మద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

మండలంలోని తిర్లంగి సమీపంలో పాదచారుడిని ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు 108కు సమాచారం వచ్చారు. గాయపడిన వారిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. నీలాపురం గ్రామానికి చెందిన కారుగ్గి చంద్రయ్య పక్కనున్న ఊరికి నడుచుకుంటూ వెళుతుండగా టెక్కలి నుంచి వస్తున్న ద్విచక్ర వాహనదారుడు జన్ని మోహన్‌రావు ఢీకొన్నాడు. టెక్కలి ఎస్ఐ గోపాలరావు కేసు నమోదు చేస్తున్నారు.





గాయపడిన చంద్రయ్య, మోహనరావు

వేరుశనగ విత్తనాలు పంపిణీ


వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

సంతబొమ్మాళి: ఉమిలాడలో ప్రభుత్వం సబ్సిడీపై అందజేసిన వేరుశనగ విత్తనాలను పిఎసిఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయకులు, ఎంపిపి ప్రతినిధి మేరుగు అప్పారావు రైతులకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులు విత్తనాలు, ఎరువులు సబ్సిడీపైన అందజేసిన ఘనత సిఎందేనని అన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు అడ్ల అప్పారావు, ఫీల్డ్ అసిస్టెంట్ పి.కృష్ణారావు, అగ్రికల్చర్ అసిస్టెంట్ రామరాజు పాల్గొన్నారు.

ధర్మాన పరామర్శ


సత్యమమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కృష్ణదాస్

నందిగాం: కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక తల్లి సత్యమమ్మ ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్ శుక్రవారం తిలక్‌ను, కుటుంబసభ్యులను పరామర్శించారు. సత్యమమ్మ చిత్రపటానికి పూలమాలేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో మామిడి శ్రీకాంత్, ఎంపిపి శ్రీరామ్మూర్తి, గోపాలకృష్ణ, సంజీవరావు, తదితరులు పాల్గొన్నారు.

జగదీశ్వరరావుకు పరామర్శ

బూర్జ: మండలంలోని పాలవలస గ్రామానికి చెందిన జల్లు జగదీశ్వరరావు తండ్రి, విశ్రాంత లెక్చరర్ అప్పలనాయుడు మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ శుక్రవారం జగదీశ్వరరావు కుటుంబసభ్యులను పరామర్శించారు. అప్పలనాయుడు చిత్రపటానికి పూలమాలేసి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. స్పీకర్ తమ్మినేని సీతారాం ఫోన్‌లో జగదీశ్వరరావుతో మాట్లాడారు. అప్పలనాయుడు మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో కె.నాగేశ్వరరావు, పాలకొండ నగర పంచాయతీ కౌన్సిలర్లు వెలమల మన్మథరావు, కె.వెంకటరమణ, కె.మోహన్‌రావు, కె.గంగునాయుడు, జల్లు అప్పలస్వామినాయుడు, జల్లు బలరాంనాయుడు, పి.ధవళేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి విజయానికి కృషి చేయాలి

కొత్తూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి విజయానికి కృషి చేయాలని పాతపట్నం నియోజకవర్గ నాయకులు లోతుగెడ్డ తులసి వరప్రసాదరావు అన్నారు. శుక్రవారం స్థానిక భయ్యాల కాంప్లెక్స్‌లో మండలంలోని యువకులతో జగన్న టీమ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 175కు 175 సీట్లు గెలిచేలా యువకులు పనిచేయాలన్నారు. స్థానికులకే టిక్కెట్ ఇచ్చేలా అధిష్టానం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి గ్రామం నుండి ఐదుగురు వైసిపి యువ కార్యకర్తలు స్థానికులకే టిక్కెట్ కేటాయించాలని సూచించారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత యువ కార్యకర్తలుదేనని అన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కోయిలాపు సంజీవురావు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు అంపిలి ప్రశాంత్‌కుమార్, ఎంపిపి ప్రతినిధి సవర రమేష్, చల్లా ధర్మారావు, పడల వెంకటకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రామారావుకు ఘన నివాళి


నివాళులర్పిస్తున్న శివాజీ

ఇచ్ఛాపురం: టిడిపి సీనియరు కార్యకర్త బల్ల రామారావు ఇటీవల మృతిచెందారు. ఆయన పెద్దకర్మ సందర్భంగా శుక్రవారం ఆయన చిత్రపటానికి మాజీ మంత్రి గౌతు శివాజీ పూలమాలేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కె.ధర్మారావు, నందిగామ కోటేశ్వరరావు, కాళ్ల జయదేవ్, ఆసి లీలారాణి, జి.కృష్ణ, జానకిరావు, తదితరులు పాల్గొన్నారు.

రెండు వాహనాలు పట్టివేత


పట్టుకున్న లారీతో ఎస్ఇబి అధికారులు

పొందూరు: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు వాహనాలను పట్టుకున్నట్లు సిఐ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. సర్కిల్ పరిధిలోని జి.సిగడాం మండలం సర్వేశ్వరపురం వద్ద 12 టన్నులతో ఇసుక లారీ, ఉల్లివలస వద్ద నాలుగు టన్నులతో ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నామని అన్నారు. పట్టుకుని వాహనాలను అక్కడి పోలీస్ స్టేషన్లో అప్పగించినట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ప్రత్యేకంగా నిఘా పెట్టామని అన్నారు. ఈయనతో పాటు ఎస్ఇబి ఎస్ఐ మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

టెక్కలి రూరల్: ప్రజా చైతన్యమే ఊపిరిగా, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ పీడిత ప్రజలకు రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న బహుజన కళా మండలి 25వ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని పాటలతూట బహుజన కళా మండలి వ్యవస్థాపకులు ఉదయ్‌భాస్కర్ పిలుపునిచ్చారు. విజయవాడలో డిసెంబరు 10న మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం టెక్కలిలోని అంబేద్కర్ విగ్రహ సమీపంలో మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్య అతిథులుగా కత్తి పద్మారావు, ప్రజాకవి జయరాజు, సినీ గేయ రచయిత మాష్టార్జీ, డాక్టరు కోయి కోటేశ్వరరావు హాజరవుతారని తెలిపారు. ఈ సభలో అంబేద్కర్ సాంఘిక విప్లవ గీతాలు అనే పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆల్‌ఇండియా దళిత్ రైట్స్ ఫోరం జిల్లా అధ్యక్షులు కంఠ వేణు, న్యాయవాది లకినేని శ్రీనువాసరావు, గొర్లె ప్రసాద్, సుంకు గోపినాథ్, చింతాడ వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు

'ఎమ్మెల్యే కృషితో నియోజకవర్గానికి నిధులు'

మెళియాపుట్టి: ఎమ్మెల్యే రెడ్డి శాంతి కృషితో నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.265 కోట్లు విడుదల అయ్యాయని వైసిపి మండల కన్వీనరు పల్లియోగి, ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్‌కుమార్, జెడ్‌పిటిసి జి.ఎండయ్య పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉద్దానం మంచినీటి ప్రాజెక్టుకు అనుసంధానం వల్ల మెళియాపుట్టి, పాతపట్నం, హిరమండలం మండలాలకు తాగునీరు అందుతుందని తెలిపారు. ఆయనతో పాటు వైసిపి నాయకులు ఉన్నారు.

బోరు పనులు ప్రారంభం

సోంపేట: మండలంలోని మామిడిపల్లి గ్రామంలో శుక్రవారం సర్పంచ్ పి.శేషగిరి బోరు పనులను ప్రారంభించారు. గ్రామంలోని నీలకంఠేశ్వర ఆలయంలో ఒకటి, గానుగుల తరుణాచారి విజ్ఞాన కేంద్రంలో మరొక బోరు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిటిసి దున్న మాధవరావు, గ్రామస్తులు టి.వీరస్వామి, లింగరాజు, నాని, రామారావు, సింహాచలం, బాబూరావు, పాపారావు, బలరాం తదితరులు పాల్గొన్నారు.

హేమలత కుటుంబానికి ఆర్థికసాయం


కుటుంబసభ్యులకు సాయం అందిస్తున్న హెచ్‌ఎం

ప్రజాశక్తి - పొందూరు

మండలంలోని తాడివలస జెడ్‌పి పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కొమ్మన హేమలత ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. ఆమె సంతాప సభలో సహచర విద్యార్థులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు విరాళంగా సేకరించిన రూ.55వేలను హెచ్‌ఎం ఎల్.హేమనాచార్యులు బాలిక తల్లిదండ్రులకు అందజేశారు. అనంతరం విద్యార్థిని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలివైన, క్రమశిక్షణ కలిగిన విద్యార్థినిని పాఠశాల కోల్పోయిందని ఉపాధ్యాయులు అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనంతభట్లు గోపాలరావు, సీపాన భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

బీమా అందజేత


వైఎస్ఆర్ బీమాను అందిస్తున్న ప్రేమ్‌కుమార్

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

మున్సిపాలిటీలోని పురుషోత్తపురానికి చెందిన నెయ్యల లక్ష్మీ అనారోగ్యంతో మృతిచెందింది. ఆమె కుటుంబానికి వార్డు కౌన్సిలరు సుగ్గు ప్రేమ్‌కుమార్ ఆమె కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలరు ప్రతినిధి చాట్ల తిరుపతి, ఆర్‌పి గాలి ఈశ్వరి, సచివాలయ సిబ్బంది సుజిత్‌కుమార్, శాంతి పాల్గొన్నారు.

అధికంగా పురుగుమందులు వాడొద్దు

శాస్త్రవేత్త పి.వి.కె జగన్నాథం



మాట్లాడుతున్న పరిశోధనా సంచాలకులు జగన్నాథం

ప్రజాశక్తి-రణస్థలం

మొక్కజొన్నను ఆశించే కత్తెర పురుగు నివారణకు ఒకే రకమైన రసాయనిక పురుగు మందును విరివిగా వాడటం వల్ల ఆ పురుగు ఆ మందులకు రోగ నిరోధక శక్తిని పెంచుకుంటుందని,రాబోయే కాలంలో పురుగు మందులతో దాని నివారణ కష్టసాధ్యమని ఆచార్య ఎన్‌జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహ పరిశోధనా సంచాలకులు డాక్టర్ పి.వి.కె. జగన్నాథం అన్నారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రణస్థలం మండలం నగరపాలెం గ్రామంలో మొక్కజొన్నలో డ్రోన్‌తో జీవ నియంత్రణ పురుగు మందుల పిచికారిపై రైతులకు శిక్షణ, అవగాహనా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ పురుగు మందుల పిచికారీకి కూలీల సమస్య అధికంగా ఉన్న ప్రస్తుత తరుణంలో రైతులు డ్రోన్ల వినియోగంపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు సహాయపడే జీవనియంత్రణ పురుగు మందుల పిచికారీకి డ్రోన్‌ను వినియోగించడం దేశంలోనే ఇదే తొలిసారి అని ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.విశాలాక్షి అన్నారు. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగించడం వల్ల ఎకరాకు సరిపడ మందును 10 లీటర్ల నీటిలో కలిపి కేవలం 15 నిమిషాల వ్యవధిలో పిచికారి చేయవచ్చని అన్నారు.ా కూలీల ఖర్చు, సమయం ఆదా అవడంతో పాటు సుమారు 90 శాతం వరకు నీటిని కూడా ఆదా చేయవచ్చని అన్నారు. కత్తెర పురుగు నివారణకు ముందస్తుగా విత్తేటప్పుడే విత్తన శుద్ధి చేసుకున్నట్లయితే 20 రోజుల వరకు కత్తెర పురుగు రాకుండా అదుపు చేయవచ్చని ఏరువాక కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ జి.చిట్టిబాబు అన్నారు. సాధారణంగా మొక్కజొన్న పిండిని చిన్న పిల్లల పోషకాహార పదార్థాల తయారీలో వినియోగిస్తారని, పంట దశలో రసాయనిక పురుగుమందులు విరివిగా వాడటం వల్ల వాటి అవశేషాలు పిల్లల శరీరంలో చేరి కొత్త రకమైన అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని కెవికె ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు.

దేశంలో ఇదే ప్రథమం

రబీలో మొక్క జొన్నలో పురుగు మందుల పిచికారీకి డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాలో తొలిసారిగా డ్రోన్‌ను పరిచయం చేసి సుమారు 100 ఎకరాల్లో పురుగు మందులు పిచికారీ చేసి ఫలితాలను పరిశీలించినట్లు డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రాంతీయ మేనేజర్ ఆర్.హరిబాబు అన్నారు. రైతుల నుండి సానుకూల స్పందన ఉండడంతో ఈ ఏడాది మొక్కజొన్న పంటలో జిల్లా వ్యాప్తంగా సుమారు 3000 ఎకరాల్లో పురుగు మందుల పిచికారీకి డ్రోన్లను వినియోగించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అన్నారు. అనంతరం డ్రోన్ యంత్రంతో మెటారీజియం జీవ నియంత్రణ పురుగు మందు పిచికారీ విధానంపై అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం వ్యవసాయ ఇంజినీరింగ్ విభాగ శాస్త్రవేత్త రైతుల సమక్షంలో క్షేత్ర స్థాయి ప్రదర్శన నిర్వహించడంతో పాటు, రైతులు అడిగిన వివిధ రకాల సందేహాలను నివత్తి చేసారు. కార్యక్రమంలో కెవికె సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ యస్.అనూష, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయకర్తలు, సమీప గ్రామాల రైతు సోదరులు పాల్గొన్నారు.

సులభ పద్ధతుల్లో బోధన అవసరం


ఎచ్చెర్ల : అవగాహన కల్పిస్తున్న రీసోర్స్‌పర్సన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

విద్యార్థులకు భాషా పరిజ్ఞానం ఎంతో అవసరమని, అప్పుడే సులభమైన పద్ధతుల్లో తరగతుల నిర్వహణ సాధ్యమవుతుందని జిల్లా విద్యాశాఖాధికారి గార పగడాలమ్మ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని ఎన్టీఆర్ నగరపాలక సంస్థ హైస్కూల్లో ఉపాధ్యాయుల అభ్యసనాభివృద్ధి తరగతులను ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుతున్న కాలనుగుణంగా బాషా, బోధనలో వస్తున్న మార్పులను అన్వయించుకోవాలన్నారు. బాష పట్ల ఇష్టాన్ని పెంచుకోవాలన్నారు. పాఠశాలలో స్కూలు కాంప్లెక్స్ స్థాయి లో గల తెలుగు భాషా ఉపాధ్యాయులందరికి కాంప్లెక్ చైర్మన్ దేవదత్తానంద్ శిక్షణ ఇచ్చారు. రీసోర్స్‌పర్సన్‌గా జలుమూరు హైస్కూలు హెచ్‌ఎం పి.ఎస్ నాగరాజు వ్యవహరించారు. స్కూలు కాంప్లెక్స్ పరిధిలోని భాషోపాధ్యాయులు పాల్గొన్నారు.

బోధనా తరగతులపై శిక్షణ

ఎచ్చెర్ల : మండలంలోని ఫరీదుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్సు ఉపాధ్యాయులకు డైట్ ఆధ్వర్యాన బోధనా తరగతులపై శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కరోనా వల్ల విద్యలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక బోధనా పద్ధతుల్లో మెళుకువలు నేర్పించారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు టి.నారాయణ మూర్తి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మండలంలోని అన్ని పాఠశాలల సైన్సు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రీసోర్స్‌పర్సన్‌గా పూజారి గోవిందరావు వ్యవహరించారు.

అమలు చేయండి.. ఫలితాలు సాధించండి

కవిటి: గత నాలుగు రోజులుగా టీచింగ్ ఎట్ రైట్ లెవెల్ శిక్షణలో నేర్చుకున్న అంశాలు పాఠశాల స్థాయిలో అమలు చేసి అత్యుత్తమ ఫలితాలు సాధించాలని మండల విద్యాశాఖ అధికారి ధనుంజయ మజ్జి ఆకాంక్షించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో నాలుగు రోజులుగా జరుగుతున్న టీచింగ్ ఎట్ రైట్ లెవల్ ఉపాధ్యాయ శిక్షణ ముగింపు కార్యక్రమం శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఎంఇఒ ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. టీచింగ్ ఎట్ రైట్ లెవెల్ ప్రారంభ పరీక్షకు అనుగుణంగా విద్యార్థుల స్థాయిని గుర్తించి, అందుకు అనుగుణంగా తెలుగు, గణితం బోధించాలని సూచించారు. ముఖ్యంగా ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న అంశాలు పాఠశాలల్లో అమలు చేసి, విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీయడానికి కషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్పిలు జుదిష్టి రోలో, జగదీశ్వరరావు, తులసి దాస్, సరస్వతి, మండల సీనియర్ ఉపాధ్యాయులు బల్లెడ లక్ష్మణమూర్తి, కేశవ పురియా, రవి, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



కవిటి : మాట్లాడుతున్న ఎంఇఒ ధనుంజయ మజ్జి


మాట్లాడుతున్న డిఇఒ పగడాలమ్మ

చదువుతో పాటు ఆటపాటలు

కోటబొమ్మాళి: విద్యార్థులను చదువుతో పాటు, ఆట, పాటలతో ఉత్తేజితం చేయాలని ఎంఇఒ గోవిందరావు అన్నారు. జెడ్‌పి బాలుర పాఠశాలలో నాలుగు రోజులుగా జరుగుతున్న శిక్షణా తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. గణితంలో పిల్లలకు ఏ విధంగా అసక్తి పెంచవచ్చో వివరించారు. రీసోర్స్ పర్సన్‌లు షన్ముఖరావు, శ్రీనివాసరావు ఆట, పాట జోడించి కృత్యాధార పద్ధతులతో పిల్లలకు ఎలా బోధించి, కనీస అభ్యసన సామర్థ్యాలు సాధించాలో తెలియజేశారు. పిల్లలను వారి స్థాయికి తగ్గట్టు అభ్యసన సామర్థ్యాలు సాధించటం ఉపాధ్యాయుల బాధ్యతని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పైడి పోలినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బూర్జ: విద్యార్థుల్లో అభ్యసన శక్తిని వెలికి తీసేందుకే శిక్షణ నిర్వహిస్తున్నామని ఎంఇఒ రామకృష్ణ తెలిపారు. శుక్రవారం ఎంఆర్‌సిలో ప్రాథమిక ప్రాథమికోన్నత ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ ముగిసింది. ఈ నెల 30న అంతర పాఠశాలల క్రీడా పోటీలను స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 30న వాలీబాల్, కబడ్డీ, ఖోఖో సీనియర్, జూనియర్ విభాగంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో హెచ్‌ఎం ధర్మాన కృష్ణదాస్, వెంకటరమణ, గణపతి, మన్మథ, రమణారావు, బుజ్జమ్మ, ఎంఆర్‌పి జి.శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

'ఐతమ్' విద్యార్థులకు సదస్సు



ప్రజాశక్తి - టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల ఎంబిఎ విద్యార్థులకు 'డిజిటల్ అండ్ సోషల్ మీడియా మార్కెటింగ్ కాలేజ్' అనే అంశంపై వారం రోజుల పాటు నిర్వహించిన సదస్సు శుక్రవారం ముగిసిందని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బెంగుళూరుకు చెందిన 'ఈ' మార్కెటింగ్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ సిఇఒ రంజన్ జనా డిజిటల్ మార్కెటింగ్, సోషల్ మీడియా మార్కెటింగ్, చర్చ్ ఇన్జిన్ ఆప్టమైజింగ్, పేపర్ క్లిక్ అనే అంశాలపై విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. ఆయా రంగాల్లో ఉద్యోగ, ఉన్నత విద్యావకాశాలు వంటి అంశాలపై అవగాహన కల్పించారని తెలిపారు. ఇటువంటి సదస్సుల వల్ల నేటి పోటీ ప్రపంచంలో జరుగుతున్న మార్పులు ఎప్పటికప్పుడు తెలుసుకొనే అవకాశం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఎంబిఎ హెచ్ఐడి డాక్టర్ కె.వేణుగోపాల్, ఫ్యాకల్టీ డాక్టర్ చింతామణి ప్రసాద్ పట్నాయిక్, 42 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

బిటెక్ విద్యార్థులకు 'క్రాఫ్టింగ్ ఎ సక్సెస్‌ఫుల్ ఇంజినీరింగ్ కెరియర్' అనే అంశంపై మొరాదాబాద్ ఐఎఫ్‌టియు యూనివర్సిటీ సహాయ ఆచార్యులు మునేంద్రకుమార్ శుక్రవారం ఆన్‌లైన్ సదస్సు నిర్వహించారు. గేట్, జిఆర్ఇ, క్యాట్ వంటి పోటీ పరీక్షలను ఎదుర్కొనేందుకు ఎలా చదవాలి, వాటిని సాధిస్తే కలిగే ప్రయోజనాలను తెలియజేశారు.


మాట్లాడుతున్న విఠల్‌రావు

మంత్రికి చేతగాకే వంశధార నీరివ్వలేదు

ప్రజాశక్తి - పలాస

మంత్రి సీదిరి అప్పలరాజుకు చేతకాకే పలాస, వజ్రపుకొత్తూరు మండలాల శివారు భూములకు వంశధార నీరు అందలేదని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి. విఠల్‌రావు ఆరోపించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే అచ్చెన్న, ఎంపీ రామ్మోహన్‌నాయుడుపై మంత్రి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. గతంలో గౌతు శివాజీ హయాంలో వంశధార శివారు భూములకు నీరు ఇచ్చామని, వైసిపి అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్లలో ఎందుకు వంశధార నీరు ఇవ్వలేకపోయారని విమర్శించారు. నిబంధనలకు అనుగుణంగానే అచ్చెన్నాయుడు ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేశారని అన్నారు. ఆఫ్‌షోర్ రిజర్వాయరుపై ఎన్ని సార్లు అసెంబ్లీలో చర్చించారో మంత్రిగారే చెప్పాలన్నారు. కింజరాపు కుటుంబం ఈ జిల్లాకు ఎన్నో సేవలు అందించారన్నారు. కింజరాపు కుటుంబీకులు ఏ వ్యాపారం చేశారో మంత్రి గారే చెప్పాలన్నారు. పలాస నియోజకవర్గాన్ని అవినీతికి అడ్డాగా మార్చేవారని ఆరోపించారు. ఎంపీ పార్లమెంట్‌లో ప్రజా సమస్యలపై ప్రస్తావిస్తుంటే వైసిపికి చెందిన 23మంది ఎంపీలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు ఉత్తం లక్ష్మణ్‌కుమార్, కార్యదర్శి దువ్వాడ సంతోష్ కుమార్, జిల్లా కార్యదర్శి తమ్మినేని గంగారాం, వంకల కూర్మారావు, మామిడి ధర్మారావు పాల్గొన్నారు.


నీటి పొదుపు పాటిస్తేనే ప్రయోజనం

వజ్రపుకొత్తూరు: నీటిని పొదుపుగా వినియోగించుకుంటేనే ప్రయోజనం ఉంటుందని కిడిసింగి సర్పంచ్ నర్తు లక్ష్మీనారాయణ అన్నారు. జల జీవన్ మిషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కిడిసింగిలో అవగాహన ర్యాలీ చేశారు. అనంతరం సచివాలయంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. ఈ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ తాగునీరు అందించనున్నట్లు తెలిపారు. కిడ్నీ ప్రభావిత గ్రామాల్లో శుద్ధి జలాలు సరఫరా అత్యంత ఆవశ్యకమన్నారు. దీన్ని గుర్తించి ప్రభుత్వం ఇంటింటికీ శుద్ధి చేసిన నీటిని సరఫరాకు చర్యలు తీసుకుంటోందని తెలిపారు. నీటి సరఫరా, వినియోగం కోసం 15 మందితో కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జల జీవన్ మిషన్ ప్రాజెక్టు పలాస డివిజన్ టీమ్ లీడర్ నిరంజన్, ప్రతినిధులు శివకుమార్, మురళి, పంచాయతీ కార్యదర్శి టి.ఈశ్వరరావు, సచివాలయం సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



నిర్వహిస్తున్న అవగాహనా ర్యాలీ

తెలియని లింకులపై క్లిక్ చేయొద్దు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కార్తీక్

ప్రజాశక్తి - పలాస

సెల్‌ఫోన్‌లో తెలియని లింకులపై క్లిక్ చేయకూడదని యాక్సిస్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ కార్తీక్ అన్నారు కాశీబుగ్గ శ్రీ మేధా జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఎటిఎం నుంచి నగదు అందకపోతే ఎటిఎంలో క్యాన్సిల్ నొకి, హోం స్క్రీన్ కనిపించిన తరువాత మాత్రమే బయటకు వెళ్లాలన్నారు. కస్టమర్ కేర్ నెంబర్, మొబైల్ నెంబర్ మాదిరిగా ఉండదని జాగ్రత్త వహించాలన్నారు. అపరిచిత వ్యక్తులను గమనించాలని, అనవసరమైన యాపులను డౌన్‌లోడ్ చేసి మీ అకౌంట్‌లో ఉన్న డబ్బును పోగొట్టుకోకూడదని చెప్పారు ఉపయోగించేటప్పుడు పిన్నును నమోదు చేసే సమయంలో ఇతరులకు కీ ప్యాడ్ కనిపించకుండా రెండో చేతిని అడ్డంగా ఉంచాలన్నారు. ఎలాంటి సమస్య ఉన్నా నివృతి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ బమ్మిడి చంద్రశేఖర్, అధ్యాపకులు మేఘూరావు, శ్రీను, దిలీప్, రవి, తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం


శివాజీ నగర్‌లో పర్యటిస్తున్న మున్సిపల్ చైర్మన్ గిరిబాబు

ప్రజాశక్తి - పలాస

వార్డుల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడతామని పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. పలాస - కాశీబుగ్గ మున్సిపాలిటీ 20వ వార్డు శివాజీనగర్‌లో శుక్రవారం ఆయన పర్యటించారు. వార్డులో తాగునీటి సమస్య, మురికి కాలువలు, సిసి రోడ్లు పరిస్థితిని పరిశీలించారు. నూతనంగా నిర్మించనున్న రోడ్లు, మురికి కాలువలు నిర్మాణం కోసం స్థల పరిశీలన చేశారు. ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా, ప్రజల ఇబ్బందుల దృష్ట్యా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. సమస్య ఎక్కడున్నా తక్షణమే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక వార్డ్ కౌన్సిలర్ ప్రతినిధి అంబటి ఆనంద్, కో-ఆప్షన్ సభ్యులు బమ్మిడి సంతోష్, టౌన్ ప్లానింగ్ అధికారులు, వార్డ్ సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు

ప్రజాశక్తి - ఆమదాలవలస

ప్రజలను ఇబ్బందులు గురిచేస్తే చర్యలు తప్పవని పురపాలక సంఘ ప్రజారోగ్యశాఖ అసిస్టెంట్ ఇంజినీరు బి.సృజన అన్నారు. శుక్రవారం పట్టణంలోని 16వ వార్డు పరిధిలోని కుసుమంచి వీధిలో ఉన్న సౌభాగ్య లక్ష్మి ఎంటర్‌ప్రైజస్ పాత సంచులు, ప్లాస్టిక్ బ్యాగ్స్ గోడౌన్‌ను ఆమె తనిఖీ చేసి, దస్త్రాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పాత సంచుల గోడౌన్ నుండి వచ్చే దుమ్ము, ధూళితో స్థానికులు ఇబ్బంది పడుతున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు తనిఖీ నిమిత్తం ఇక్కడకు వచ్చినట్లు తెలిపారు.

ప్రజలకు అసౌకర్యాన్ని కలిగిస్తే ఎంతటి వారైనా చర్యలు తప్పవని గోదాం యజమాని బరాటం నాగరాజును హెచ్చరించారు. ఇతరులకు ఇబ్బంది కలగకుండా చూడాల్సిన బాధ్యత యజమానిదేనని స్పష్టం చేశారు. స్థానికుల నుండి మరోసారి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

తహశీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి

కోటబొమ్మాళి: లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీలో తహశీల్దార్ జామి ఈశ్వరమ్మ ప్రోటోకాల్ పాటించకుండా తన సొంత నిర్ణయాలతో ముందుకు వెళ్తున్నారని సర్పంచ్ కాళ్ల సంజీవరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు బోయిన నాగేశ్వరావు అన్నారు. ఆమెపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని పంచాయతీ వార్డు మెంబర్లు, ఎంపిటిసిలతో కలిసి శుక్రవారం టెక్కలి సబ్ కలెక్టర్, కలెక్టర్‌కు వినతిపత్రాలు ఇచ్చి, ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ కోటబొమ్మాళి గ్రామ పంచాయతీకి చెందిన ఇళ్ల పట్టాలు లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేసి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌కు, పంచాయతీ సర్పంచ్‌కు, వార్డ్ సభ్యులకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వడం లేదని, ప్రోటోకాల్ పాటించకుండా తహశీల్దార్ తన నిర్ణయాలతో ముందుకు వెళ్తున్నారని అన్నారు. ఈ విషయమై సిఎం కార్యాలయానికి తెలియజేశామని పేర్కొన్నారు. వినతిపత్రం అందించిన వారిలో నాయకులు డబ్బీరు ప్రదీప్, బోయిన కృష్ణారావు, చిరంజీవి పాల్గొన్నారు.